

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

కడప అర్బన్ : కడప డివిజన్ పరిధిలో ఎలక్ట్రికల్ ఏ గ్రేడ్ స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ జి. వి రమణ, పాత రింగ్స్ సబ్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న హరి కేశవరెడ్డి షిఫ్ట్ ఆపరేటర్లకు పిఎఫ్, ఇఎస్ఐ కట్టలేదని, వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ రమణ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలో ఇటీవల 8 మంది కార్మికులు చనిపోయారని, వారి కుటుంబాలలో మానవతా దృక్పథంతో అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కొంతమంది వీరి నుంచి రూ. లక్షలు తీసుకున్నారని తెలిపారు. అధికారులు అర్జీలను చిరునవ్వుతో స్వీకరించే విధంగా చూడాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య కార్మికులు పాల్గొన్నారు.

డిడి అచ్చెన్నది హత్యే

- పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ
- ఆరోపణదారుల్లో ఒకరిపైనే కేసు నమోదు!
- మిగిలిన నిందితులకు నేరంలో భాగం లేనట్లేనా?
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ పాత్రపైనా ఆరా



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్యకు గురైనట్లు తేలిసిందే. ఎస్పి కె.కె.ఎన్.అన్బురాజన్ విలేకరుల సమావేశంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అచ్చెన్న హత్య కేసు ఛేదించిన క్రమాన్ని పరిశీలిస్తే ఈ నెల 12న డాక్టర్ అచ్చెన్న అదృశ్యం కావడం, 14వ తేదీన ఆయన కుటుంబీకులు కడపలోని వెటర్నరీ విభాగానికి చెందిన ముగ్గురు సహ ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం, 27వ తేదీన పోలీసుల విచారణలో హత్యకు గురైనట్లు నిర్ధారణ కావడం తెలిసిందే. ఈ నెల 12 నుంచి 27వ తేదీ వరకు పోలీసుల విచారణలో చోటుచేసుకున్న నిర్లక్ష్యంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన జిల్లా అధికారి ఫిర్యాదు చేసిన వెంటనే హత్యాయత్నం కేసుగా పరిగణించి విచారణను వేగవంతం చేయాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది. అచ్చెన్న కొందరిపై కేసు నమోదు చేసినప్పటికీ స్పందన లేకపోవడం, ఆయన కుటుంబీకులు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించినరీతిలో విచారణ సాగించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్లక్ష్యం ఖరీదు నిండుప్రాణం

అచ్చెన్న వర్సెస్ ఇద్దరు ఎడి, ఓ డాక్టర్ మధ్య నెలకొన్న వివాదాన్ని నెలల తరబడి సీరియల్‌గా కొనసాగించడంలోని జెడి, ఉన్నతాధికారుల వైఫల్యమే హత్య ఉదంతానికి దారితీసిందనే చర్చ నడుస్తోంది. ధర్నాలు, నిరసనలు, గేట్లకు తాళాలు వేయడం, ఎఫ్ఆర్ఎస్ వేయకపోవడం, సరెండర్లు చేయడం, నెలల తరబడి జీతాలు లేక పోవడం వంటి ఘటనల నేపథ్యంలో అప్రమత్తం కావాల్సి ఉంది. మొక్కుబడిగా త్రిసభ్య కమిటీ పేరుతో విచారణ సాగించడం, సత్వరమే చర్యలు తీసుకపోవడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యమే హత్యోదంతానికి దారి తీయడానికి కారణమనే వాదన వినిపిస్తోంది. జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు వీరందరినీ డిప్యూటేషన్‌పై జిల్లాలోని వివిధ ప్రాంతాలకు పంపించి ఉంటే ఇంతటి దారుణం చోటు చేసుకుని ఉండేది కాదనే వాదన వినిపిస్తోంది.

ఒక్కరిపైనే కేసు నమోదు

అచ్చెన్న హత్య కేసులోని డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌పైనే పలు సెక్షన్ల కింద నేరం నమోదు చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్న ముగ్గురు సహ ఉద్యోగుల్లో ఇద్దరికి నేరంలో భాగం లేకపోవడమేమిటనే వాదన ప్రజాసంఘాల నుంచి వినిపిస్తోంది. పైనపేర్కొన్న నిందితునితో కలిసి వీరిద్దరూ తీవ్ర స్థాయిలో విభేదించిన సంగతి తెలిసిందే. వీరితోపాటు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తమవు తుండడం గమనార్హం. పోలీసులు ఆ కోణంలోనూ దృష్టి సారించామని పేర్కొనడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది.

వీరిద్దరూ నిర్దోషులేనా!

అచ్చెన్న కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్న ముగ్గురిలో ఒకరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మిగిలిన ఇద్దరు సహ ఉద్యోగులు నిర్దోషులేనా, వీరిద్దరూ పెత్తందారీ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతోనే ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం కోణంలో విచారణ సాగించలేదా, లేక ఒత్తిళ్ల కారణంగా తప్పించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్నెళ్లుగా మృతునితో తీవ్రస్థాయిలో విభేదాలు కొనసాగించిన సంగతి తెలిసిందే. నిరసనలు, ధర్నా వంటి చర్యలతో వ్యతిరేకత నేపథ్యంలో పరోక్షంగానైనా హత్య గురించి తెలిసే ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఈలెక్కన హత్య గురించి తెలిసినప్పటికీ పోలీసుల దృష్టికి తేకపోవడమూ నేరమే కదా అనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి కోణంలోనూ విచారణ సాగిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉంటాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా అచ్చెన్న హత్య అధికారుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి కారణమనడంలో సందేహం లేదు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

- మీడియా సమావేశంలో ఎస్పి అన్బురాజన్ వెల్లడి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆయనది హత్యగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పి అన్బురాజన్ సోమవార పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్సు హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 12న పశు సంవర్ధక శాఖలో పనిచేసే అసిస్టెంట్ సర్జన్ సుభాష్‌చంద్రబోస్, కలసపాడుకు చెందిన బావలూరి చెన్నకృష్ణ, గుర్రంకొండకు చెందిన మూడే బాలాజీ నాయక్ డిడి అచ్చెన్నను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి రాయచోటికి తీసుకెళ్లారని ఎస్పి చెప్పారు. అక్కడ వారు మృతుడికి మద్యం తాగించి అదే రోజు మధ్యాహ్నం గువ్వల చెవురు ఘాట్‌కు చేరుకున్నారని తెలిపారు. ఆ సమయంలో అచ్చెన్న మద్యం మత్తులో అపస్మారక స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. నిందితులు మృతుడి ఛాతిపై బలంగా తన్నడంతో లోయలో పడిపోయారని వెల్లడించారు. దీంతో ఆయన్ను అక్కడే వదిలి వెళ్లిపోయారని పేర్కొన్నారు. నిందితులు సాక్షాధారాలను రూపు మాపేందుకు మృతుడి మొబైల్‌ను తీసుకుని ఫోన్ ఒక చోట, సిమ్ కార్డు మరో చోట పారవేశారని తెలిపారు. ఇదీలా ఉండగా మృతుడి కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి ఈనెల 14న తన తండ్రి కన్పించడం లేదని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈనెల 24న గువ్వల చెరువు ఘాట్‌లో అచ్చెన్న అనుమానాస్ప స్థితిలో మృతిచెంది పడినట్లు తెలిపారు. రామాపురం పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేపట్టారని, అదేశాఖలో పని చేస్తున్న సుభాష్ చంద్రబోస్‌పై అనుమానం రావడంతో అతన్ని విచారించారన్నారు. ఈనెల 26న సాయంత్రం ముగ్గురు నిందితులు కడప విఆర్ఓ ఎదుట లొంగిపోయి తమ నేరాన్ని అంగీకరించారని తెలిపారు. వీరిని విఆర్ఓ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించగా జ్యూడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరు పరిచారన్నారు. పశుసంవర్ధకశాఖలో విధుల్లో ఉన్న డాక్టర్ అచ్చెన్న, డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మధ్య తీవ్ర మనస్పర్థలున్నాయని తెలి పారు. ఇదే హత్యకు ప్రధాన కారణమైందని స్పష్టం చేశారు. సమావేశంలో కడప డిఎస్పి వెంకట శివారెడ్డి, దిశా పోలీస్ స్టేషన్ ఎస్పి వాసుదేవన్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జిచే విచారించాలి : మందకృష్ణ మాదిగ

డిడి అచ్చెన్న హత్య కేసును సిట్టింగ్ జడ్జిచేత విచారించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు చేసినా 12 రోజుల పాటు పోలీసులు స్పందించలేదన్నారు. మృతదేహానికి కర్నూలు వైద్య నిపుణులతో పోర్టుమార్టం నిర్వహించాలన్నారు. ఈనెల 12న అచ్చెన్న అదృశ్యమైతే 14న ఆయన్ను ఎలా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన పేర్లలో ఒకరి పేరు తొలగించాలని కడప వన్‌టౌన్ సిఐ నాగరాజు బెదిరించారని తెలిపారు. సిఎం జగన్ సొంత జిల్లాలో దళిత ఉన్నతాధికారి ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో గృహ నిర్మాణ పథకం కింద నిర్దేశించిన పనులను సమర్థవంతంగా, త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ నుంచి మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, యాక్షన్ ప్లాన్‌తో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగ వంతం చేయాలని పేర్కొన్నారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. జగన్నన గృహ నిర్మాణాలలో ఎలాంటి లోటుపాట్లకు తావి వ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి నిర్దేశించిన, ఆశించిన పురోగతిని చూపాలని అన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డఒలు ధర్మ చంద్రా రెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

'విద్యుత్' కొత్త తరహా బాదుడు ఆపాలి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

కేంద్ర ప్రభుత్వం అదనపు లోడు, పీక్ డిమాండ్ పేరుతో ప్రజలపై కొత్త తరహా విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపాలని జారీ చేసిన ఆదేశాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నేరుగా ప్రజలపై వేసే విద్యుత్ భారాలు కాకుండా కొత్త తరహా భారాలు మోపేందుకు సిద్ధమవుతుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ (రైట్ ఆఫ్ కన్స్యూమర్) సవరణ రూల్స్ 2023 ముసాయిదాను కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దీనిమీద ఏప్రిల్ 14 లోపు అభిప్రాయాలు చెప్పాలని రాష్ట్రాలను కోరిందని పేర్కొన్నారు. రాష్ట్రాల అభిప్రాయాల అనంతరం ప్రజలపై కొత్త తరహా విద్యుత్ ఛార్జీల రూపంలో భారాలు పడబోతున్నాయని తెలిపారు. డిస్కంలు గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేటప్పుడు వాడుకునే విద్యుత్ పరికరాల ఆధారంగా లోడ్‌ను నిర్ణయిస్తారని చెప్పారు. ఒక కిలోవాట్‌కు రూ.1750, 2 కిలోవాట్‌లకు రూ. 3750 చొప్పున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏడాదిలో మూడు నెలలు వాడకం పెరిగితే పెరిగిన కేటగిరీకి మార్చాలని ఈ ముసాయిదాలో పేర్కొన్నారని తెలిపారు. దీన్ని స్మార్ట్ మీటర్ల ఆధారంగా లెక్కిస్తారని వివరించారు. అందుకే స్మార్ట్ మీటర్ల బిగింపును సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. లోడ్ పెరిగితే కేటగిరి మార్చాలన్న కేంద్రం, లోడ్ తగ్గితే మినహాయింపులపై వెసులుబాటు కల్పించలేదని పేర్కొన్నారు. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో వినియోగదారుల నుంచి 20 శాతం అధికంగా ఛార్జీలు వసూలు చేయాలని కేంద్రం ముసాయిదాలో పేర్కొన్నారని చెప్పారు. దీనికోసం టైమ్ ఆఫ్ డే విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. దీని కారణంగా విద్యుత్ వినియోగదారులకు తెలియకుండానే అదనపు భారాలు పడే పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ ఛార్జీల కొత్త తరహా భారాలు మోపేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రజానీకాన్ని కలుపుకుని పోరాటాలు చేస్తామని తెలిపారు. సమావేశంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఎం.ఆర్ నాయక్ పాల్గొన్నారు.

తిరుమలను అపవిత్రం చేశారు : టిడిపి

కడప అర్బన్ : వైసిపి ప్రభుత్వం తిరుమలను అపవిత్రం చేస్తోందని, కొండపై గంజాయి దొరకడంపై టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. గాయత్రి టవర్స్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ వైకుంఠమైన తిరుమల కొండలో గంజాయి దొరుకతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. అరు నెలలుగా రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా విస్తరించిందని, పిల్లలు, యువకులు, విద్యార్థులు గంజాయి భారిన పడి నాశనం అవుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సాక్ష్యాత్తు తిరుమల కొండపైన అధికారులే గంజాయిని పట్టుకున్నరంటే కింద నుంచి పైకి ఏ విధంగా వస్తుందో, ప్రభుత్వ పెద్దల హస్తాలు ఉన్నాయంటూ అనుమానాన్ని వ్యక్తం చేశారు .గంజాయి పైన పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేసి, దీనిపై సిఐడి వేయాలని డిమాండ్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

31న కడపకు దేవులపల్లి అమర్ రాక

కడప : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్ ఈనెల 31న కడపకు రానున్నట్లు జిల్లా కేంద్రానికి అధికారికంగా సమాచారం అందింది. 30న రాత్రి 8 గంటలకు కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 31న కడప రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు కడప ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

సినిమారంగానికి పునాది నాటకం

ప్రముఖ ఆడిటర్ లయన్ పి.ఖాసింఖాన్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న ఖాసిం ఖాన్

ఆధునిక సమాజంలో అందరినీ ఆకట్టుకుంటున్న సినిమారంగానికి ఒకప్పుటి నాటకరంగం పునాదని ప్రముఖ ఆడిటర్ లయన్ పి. ఖాసీంఖాన్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో శ్రీ వేంకటేశ్వర సాంస్కృతిక కళామండలి ప్రధానకార్యదర్శి యస్.మధుబాబు నిర్వహణలో ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించారు. ముందుగా ధర్మవరం రామకృష్ణమాచార్యుల చిత్రపటానికి అతిథులంతా కలసి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్ పి.ఖాసీంఖాన్ మాట్లాడుతూ నాటకరంగానికి ఒకప్పుడు కడపజిల్లా ఎంతో దోహదం చేసిందని తెలిపారు. సవేరా ఆర్ట్స్ వంటి అనేక సంస్థలు ఆ దిశగా కృషిచేశాయన్నారు. ఆ కృషిలో భాగంగా నటుడుగా తాను కొంత సేవ చేసే భాగ్యం కలిగిందని చెప్పారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఆర్ట్స్ ఫ్యాకల్టీ ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, మానస హోటల్ అధినేత లయన్ కె.చిన్నపరెడ్డి, విశిష్టఅతిథి, బి.సి.వెల్‌ఫేర్ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ప్రముఖ నాటకకర్త పల్లేటి లక్ష్మీ కులశేఖర్ ఆధ్యాత్మికవేత్త వెంకటరెడ్డి,. కొండూరు జనార్దనరాజు, పుత్తా పుల్లారెడ్డి, లెక్కల కొండారెడ్డి, భూపతి రాయల్, రాయుడు, మల్లయ్య, గంగయ్య, మాచిరాజు రమణయ్య, కొత్తపల్లె రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీం వర్కర్లు, డైలీవేజ్ కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు, ఒపిస్ పునరుద్ధరణ చేయాలని, కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలి, కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని, ఎరువుల సబ్సిడీని పెంచాలని, ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్‌లో రూ. 2లక్షల కోట్లకు పెంచాలని, పట్టణాలకు విస్తరిం పజేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాను ఉద్యోగులు, కార్మికులందరూ పాల్గొని విజయంతం చేయాలని కోరారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ చెల్లించని కడపలోని కాంట్రాక్టర్ జి.వి రమణ పై చర్యలు తీసుకోవాలని, అలాగే కార్మికులకు గత ప్రభుత్వం ఇస్తున్న పది సంవత్సరాల ఇంక్రిమెంట్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండారెడ్డి, ఎస్. రామకృష్ణారెడ్డి, బి.లక్ష్మీనారాయణరెడ్డి, హరి కేశవరెడ్డి, అక్రమ్ హుస్సేన్, ప్రేమ కుమార్, రవీంద్ర, మాబు, సుజన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తగ్రూపు తెలుసుకోవాలి

ప్రజాశక్తి- కడప



గర్భిణికి సూచనలిస్తున్న డాక్టర్ వై.సావిత్రి

ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపులను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి అన్నారు. సోమవారం ప్రభుత్వ పురుషుల కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ - 3 ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులో భాగంగా శివానందపురం పరిసర ప్రాంతంలోని ప్రజలకు రక్త వర్గాలను ధారణ, హిమగ్లోబిన్ శాతాన్ని గుర్తించి వారికి వివరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త గ్రూపు తెలుసుకోవడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు అని అన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహాయంతో ఆ ప్రాంత ప్రజలకు రక్త గ్రూపుల నిర్ధారణ చేసి హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తగిన మోతాదులో రక్తం ఉన్నవారు అవసరమైన వారికి రక్తదానం చేయడం ద్వారా ఎటువంటి నష్టం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ విద్యార్థి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా సుహాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కలసపాడు : మండలంలోని స్థానిక ఇంగ్లీష్‌మీడియం పాంశాల చైర్మన్ చిత్తా బాల్‌రెడ్డి మనవడు చిత్తా సువాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఉపాధ్యాయులు, విద్యా ర్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థపకులు మాట్లాడుతూ క్రమశిక్షణ, కార్యదీక్ష, పట్టుదలతోనే పాఠశాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం కాశినాయన మండలంలోని స్వామి వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిత్తా జయమ్మ, పాఠశాల కరస్పాండెంట్ చిత్త, రాజశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్తా ,ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి పెద్ద పీట వేస్తూ పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద 104 వాహనాలను ఉప ముఖ్యమంత్రి లాంఛనప్రాయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనటువంటి విధంగా మన రాష్ట్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంబిబిఎస్ డాక్టర్ ఉండే పరిస్థితి ఉండేది కాదని, కానీ ప్రస్తుతం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు ఎంబిబిఎస్ డాక్టర్లను నియమించారని చెప్పారు. 104 వాహనం ద్వారా 64 రకాల మందులు అందుబాటులో ఉంటాయని, అదేవిధంగా ఈసీజీ కనీస అవసరానికి సంబంధించిన చికిత్సలు ఈ వాహనంలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమామహేశ్వరరావు, 104 వాహనం జిల్లా మేనేజర్ వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి - కడప అర్బన్

నూతన విద్యా విధానం నైపుణ్య ఆధారిత కార్యక్రమంలో భాగంగా యోగి వేమన విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర శాఖ విద్యార్థులు క్షేత్ర పర్యటన చేశారు. ఆ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ వి.అను ప్రసన్న, అకడమిక్ కన్సల్టెంట్, డాక్టర్ పి.మరియదాసు మూడో సెమిస్టర్ విద్యార్థులను పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చుట్టుపక్కల ఆక్వాకల్చర్ భాగంగా హేచరీలను సందర్శించారు. విద్యార్థులు కోడూరు బీచ్ సమీపంలోని రెండు హేచరీలు ప్రత్యక్షంగా పరిశీలించారు. చేపలు, రొయ్యల పెంపకం గురించి అవగాహన కల్పించారు. కోడూరు బీచ్ సందర్శించి వివిధ చేపలు రొయ్యల నమూనాలను సేకరించారు. విద్యార్థుల క్షేత్ర పర్యటనకు సహకార అందించిన కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్యకు జంతు శాస్త్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర పర్యటనకు విశ్వవిద్యాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం అక్వా రంగంలో పనిచేస్తున్న డాక్టర్ పి.హరినాథ్ రెడ్డి, పి.రాజు, ఎం. శశిధర్ రెడ్డి సహకారం అందించారని డాక్టర్ అను ప్రసన్న తెలిపారు.

అంపైరింగ్‌లో శిక్షణ కోసం అవకాశం

కడప : కడప జిల్లా క్రికెట్ సంఘంకొత్తగా అంపైరింగ్, స్కోరింగ్ క్లాసులు పరీక్షలు నిర్వహిస్తుందని జిల్లా క్రికెట్ సంఘం ప్రెసిడెంట్ ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్, డిసిఎస్. కాజామైనుద్దీన్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేర్లను ఏప్రిల్ రెండవ తేదీన నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9052748786, 9052004338లలో సంప్రదించాలన్నారు.

కుటిల రాజకీయాలకు రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి-కలసపాడు



మాట్లాడుతున్న కమలమ్మ

కేంద్రంలోని బిజెపి కుటిల రాజకీయాలకు స్వస్తి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని ఎఐసిసి సభ్యురాలు కమలమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలో చోటు చేసుకుంటున్న అవినీతిని అరికట్టేందుకు వస్తున్న రాహుల్‌గాంధీని ప్రధాని మోడీ రాజకీయ పరంగా వేధింపులకు పాల్పడ్డం సరైందని కాదన్నారు. ఆయన్ను ఎంపీ పదవి నుంచి తొలగించడం దారుణమని వాపోయారు. రాహుల్ గాంధీని ధైర్యంగా ఎదుర్కొనలేకనే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

అమరవీర జవాన్ యుగంధర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండల పరిధిలోని రాచపల్లి గ్రామానికి చెందిన వీర జవాన్ యుగంధర్ విగ్రహాన్ని స్వగ్రామంలో ఏర్పాటు చేశారు. సోమవారం జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కల్నల్ సతీష్‌కుమార్, అన్నమయ్య జిల్లా సెరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, సైనిక్ వెల్ఫేర్ సంక్షేమాధికారి రఘురామయ్య ఆధ్వర్యంలో పలువురు వీరజవాన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో యుగంధర్ ఆర్మీలో చేరి 2005లో హిమాలయ పర్వతాలోని మంచు ప్రమాదంలో మృతిచెందారని చెప్పారు. 2003లో సైనికాదికారుల ప్రోత్సాహంతో శ్రీకైలాస పర్వతారోహణ విజయవంతంగా పూర్తి చేశారని, అప్పటి రాష్ట్రపతి అబుల్ కలాం చేతుల మీదుగా సాహస వీర అవార్డును తీసుకున్నారని తెలిపారు. యుగంధర్ రాచపల్లి గ్రామ కీర్తిని ప్రపంచానికి చాటాడని పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కడప అర్బన్ : గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరిన్ని మంచి చిత్రాలు చేసి ఇంకా ఉన్నంత శిఖరాలకు ఎదగాలని సిఆర్ఐ సునీల్ జయంత్ ఆకాంక్షించారు. సోమవారం రామ్ చరణ్ పుట్టినరోజు పురస్కరించుకుని కడప మెగా అభిమానులు అంజి, చిన్న ఆధ్వర్యంలో కడప నగరంలోని గౌస్ నగర్‌లో ఉన్న జెహెచ్‌యు మదరసాలోని నిరుపేద మైనార్టీ ముస్లిం పిల్లలకు విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పంద్రా రంజిత్ కుమార్, వెంకట సురేంద్ర, సుధీర్ నాయక్, గోపాల్ నాయక్, జానీ, వెంకటేష్, జెహెచ్‌యు మదరస పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వర న్యాయం : ఎస్పి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖ కు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామ పీడి యదుభూషన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ మోహన్, నరసింహులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్-ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో తమ పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జనసమూహాలు ఉన్నచోట విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లు, జిల్లా రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, ఐసిడిఎస్, డ్వామా, పంచాయతీ రాజ్ , పశు సంవర్ధక , అటవీ శాఖాది కారులను ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన



పనిచేస్తున్న సెంట్రల్ లైటింగ్ సిస్టమ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

'అంధకారంలో కొత్తపల్లి రింగ్ రోడ్డు' అనే శీర్షికన 'ప్రజాశక్తి' దినపత్రికలో శుక్రవారం వెలువడిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా స్థానిక కొత్తపల్లి రింగ్ రోడ్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ కొన్ని ప్రాంతాల్లో పనిచేయలేదు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం పూర్తిగా అంధకారంలోకి మారిపోయింది. వాహన దారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు కథనంలో ప్రచురితమయ్యాయి. స్పందించిన పంచాయతీ సెక్రటరీ గురుమోహన్ ఆ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి



పరీక్షల సామగ్రి అందజేస్తున్న ఎంజిఒ నాగస్వర్ణలత

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎంజిఒ నాగస్వర్ణలత కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు పద్మావతి మహిళా మండలి ప్రతినిధి, గౌరవ సలహాదారు జూలియన్ రాజు పరీక్షల సామగ్రిని అందజేశారు. జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు కె.సుజాతమ్మ, మీకోసం సేవా సంస్థ విష్ణువర్ధన్, ఈశ్వర చారిటబుల్ ట్రస్ట్ రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది ఉమాదేవి, సునంద, మేరీ, సాలమ్మ, సోఫియా పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ కమిటీని వెంటనే జరపాలి

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మానుయేలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో అసైన్‌మెంట్ కమిటీని వెంటనే జరపాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజీ ఇమ్మానియేల్ కోరారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా భూములు సబ్ డివిజన్ చేసి మతపరమైన భూములు, ప్రభుత్వ భూములు, అక్రమ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేసి, అనధికార లేఔట్లకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార లేఔట్లపై కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే స్పందనలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడేలేడన్నారు. డివిజన్ పరిధి జమ్మలమడుగులో 84, పొద్దుటూరులో 149 అనధికార లేఅవుట్స్ గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న పెత్తందారులపై, వారికి సహకరించిన రెవెన్యూ అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసును బడుగులు బలహీన వర్గాల కార్యకర్తలతో ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర సమన్వయకర్త మురళీ ప్రసాద్, రాష్ట్ర సమన్వయకర్త చిన్న ఓబన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయలసీమ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, కడప జిల్లా యువజన అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, లీగల్ అడ్వైజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే నవశకానికి నాంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సచివాలయ వ్యవస్థతోనే నవశకానికి నాంది అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దశెట్టిపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన మరుక్షణంలోనే రాష్ట్రంలో సచివాలయ, వార్డు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల చెంతకే చేరవేస్తూ వాటి అమలులో ఎక్కడా అవినీతి, అక్రమాలకు చోటులేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కాకర్ల నాగశేషారెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి, ఇర్ఫాన్ బాషా, కామిశెట్టి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, రామాపురం యాకోబ్, బాషా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, సుబ్బారెడ్డి, వెలవలి శేఖర్‌రెడ్డి, కసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, భూమిరెడ్డి శంకీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒంటిపూట బడి ప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలకు ఒంటిపూట బడి ప్రారంభించాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో డిఇ మనోహర్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఒ.నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్షులు విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థులకు మార్చి 15నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ ఏడాది ఇంతవరకూ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు ఒంటి పూట బడులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మనుగడ కోసమే విభేదాల సృష్టి

పులివెందుల రూరల్ : కొంతమంది తమ మనుగడ కోసం విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, రంగనాయక స్వామి దేవస్థానం చైర్మన్ సుధీకర్‌రెడ్డి, రంగనాయక స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న వారాంతపు సంత మార్కెట్‌కు అక్కడి వ్యాపారులు వైఎస్ఆర్ పేరు పెట్టమని మున్సిపల్ కమిషనర్‌కు, చైర్మన్‌కు వినతిపత్రమిచ్చారన్నారు. ఆ మేరకు వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్ అని పేరు పెట్టామన్నారు. కొంతమంది ఈ విషయాన్ని పూర్తిగా తెలుసుకోలేదన్నారు. వాస్తవాలు తెలుసుకొని ధర్నా చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్యక్రమంలో అంకాలమ్మ గుడి మాజీ దేవస్థాన చైర్మన్ వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్లు విజయ్‌కుమార్ నాయుడు, పార్వతల కిషోర్, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, చంద్రమౌళి ఉన్నారు.

దినసరి మార్కెట్ గేటు వసూళ్ల వేలం రద్దు

ఎర్రగుంట్ల : నగర పంచాయతీకి సంబంధించిన దినసరి మార్కెట్ వసూళ్ల వేలం పాట గత రెండు దఫాలుగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. మళ్లీ మూడవసారి సోమవారం వేలంపాట నిర్వహించగా వచ్చిన కాంట్రాక్టర్లు పాట పాడకపోవడంతో దాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. అధిక ధర ఉండడం కారణంగా కాంట్రాక్టర్లు ఎవరు సుముఖత చూపలేదన్నారు. దీనిపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌కు లేఖ పంపినట్లు తెలిపారు. ఈనెల 31లోగా వేలం పాట నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. వేలంపాటలో ఇదే పునరావృతమైతే నగర పంచాయతీ ఆధ్వర్యంలో గేటు వసూలు చేస్తామన్నారు.

మాది చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ స్కూల్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన డ్వాక్రా మహిళల సభలో ఆయన మాట్లాడుతూ.. మన ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. డ్వాక్రా సంఘాలకు కేవలం మున్సిపాలిటీలోని 41 వార్డు మహిళలకు 3 విడతల్లో దాదాపు రూ.51 కోట్ల రుణమిచ్చామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి రూ.160 కోట్లు వరకు డ్వాక్రా రుణాలను మంజూరు చేశామన్నారు. నాడు-నేడు అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని 2024లో మళ్లీ తెచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారురెడ్డి, 3 వార్డు నుండి 13వ వార్డులలో ఉన్న మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కృషి

వేంపల్లె : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని జడ్‌పిటిసి రవి కుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మీగాయత్రి తెలిపారు. స్థానిక ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం వైఎస్ఆర్ ఆసరా పథకంలో మూడవ విడత నిధులు విడుదల కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల బ్యాంకు ఖాతాలో నేరుగా ముఖ్యమంత్రి జగన్ మూడో విడత డబ్బులు జమ చేశారన్నారు. మండల వ్యాప్తంగా 986 స్వయం సహాయక సంఘాలకు మూడో విడతగా రూ.10 కోట్ల 5 లక్షలు ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేసిందన్నారు. సర్పంచు రాచినేని శ్రీనివాసులు, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు ప్రయోజనం కలిగించడంతోపాటు ప్రజా సేవలోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంఘాలకు మెగా చెక్కును అందజేశారు. సిఎం జగన్ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, ఎంపిటిసిలు కటిక చంద్రశేఖర్, పద్మావతి రాజ్‌కుమార్, హబిబుల్లా, భారతి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఇడుపులపాయి సర్పంచు చలపతి, వెలుగు ఎపిఎం బాలస్వామి, వెలుగు సిబ్బంది చంద్రబాబు, నాగేశ్వరరావు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదు కోవాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమ వారం తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో రామమునిరెడ్డి, పార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అరటి, మామిడి, చీని, నిమ్మ తోటలు, నూగు, ప్రొద్దుతిరుగుడు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం రావడంతో ఎక్కువగా అలిరెడ్డిపల్లె, ఇడుపులపాయి, కుమ్మరాంపల్లె ప్రాంతాల్లో మామిడి, నిమ్మ, చీని చెట్లు విరిగిపోయాయని తెలిపారు. చెట్లకు ఉన్న కాయలు, పిందెలు పూర్తిగా రాలిపోయాయని వివరించారు. క్షేత్రస్థాయిలో పూర్తిగా పంట గణన చేపట్టకుండా అంకెల గారడీలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, యూనిట్ సభ్యులు పాపిరెడ్డి, లక్ష్మి నారాయణ, మహమ్మద్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణవలి, జబీవుల్లా, గోగుల మల్లికార్జున, డక్కా రమేష్, పోతిరెడ్డి గోపి, తెలుగు యువత మండల అధ్యక్షుడు మల్లికార్జున, గోగుల మారుతి, పిపి చెంద్రాయుడు, రామకృష్ణ, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎలాంటి ఒత్తిడికి లోను కావద్దని, క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకొని భవిష్యత్‌ను కోల్పోకూడదని డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ఎస్‌బిసిసి కెతుర సూచించారు. స్థానిక ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని 19 ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదవాలని సూచించారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సలహాదారుడు సివి సుబ్బారావు మాట్లాడుతూ విద్యాదానం మహాదానమని తెలిపారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులకు, గురువులకు, చదివిన స్కూలుకు, వారి ఊరికి మంచి పేరు తేవాలని కోరారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సంవత్సరం మొదటిసారి సంస్థ తరపున తనతోపాటే సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు (1996 బ్యాచ్) వారి సహకారంతో పరీక్షా సామగ్రి పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు. ఇందుకు సహకరించిన నా మిత్రులు డాక్టర్ శ్రీరంజన్, స్టాన్లీ వినయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మాధవ, శివకృష్ణ ఆచారి, శంకరాచారి, సునీల్, రవి, ఆల్బర్ట్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

వేంపల్లె : పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని, ఇందులో ప్రజలు భాగస్వామం కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. సోమవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని దళితవాడలో పేరుకుపోయిన చెత్త, చెదారం, వ్యర్థాలను తొలగించారు. అనంతరం ప్రతి ఇంటింటికీ వెళ్లి సామాజిక విషయాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యం పారిశుధ్యం, స్వచ్ఛ తాగునీటిపై ఆధారపడి ఉంటుందన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజారెడ్డి, వినోద్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు

పులివెందుల టౌన్ : నేత్రదానం ఇద్దరి అం ధులకు చూపునిస్తుందని నేత్ర నిధి అధ్యక్షుడు మమ్మిల రాజు అన్నారు. పట్టణ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామానికి చెందిన కంబటి గంగమ్మ ఆదివారం రాత్రి మృతి చెందడంతో ఆమె కుమారులు శ్రీరాములు, లక్ష్మయ్య, శ్రీనివాసులు నేత్ర దానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి రాజుకు సమాచారమిచ్చారు. సోమవారం నేత్రనిధి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటికెళ్లి ఆమె పార్థీవదేహం నుంచి కార్నియాలను సేకరించి, హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. బొమ్మతోటి లక్ష్మీనరసయ్య మరో నలుగురు వ్యక్తులతో (కూలీలు) కలిసి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని వాహ నంలో కడపకు తరలి స్తున్నట్లు సమాచారం అందిందన్నారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఎటిఎం వద్ద దాడి చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో విపత్తులను ఎదుర్కొందాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముందస్తు జాగ్రత్తలతో ప్రకృతి విపత్తులను ఎదుర్కొందామని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సభా భవనంలో ప్రజలు, ఆశ వర్కర్లు, రెవెన్యూ, సచివాలయ అధికారులకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్)అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా కమాండర్ మాట్లాడుతూ మన ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు మన చుట్టూ ఉండే వస్తువులు వాటర్ బాటిళ్లు, ఎండు టెంకాయలు, ఖాళీ ప్లాస్టిక్ వస్తువుల ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. ఆపద సమయంలో ప్రథమ చికిత్స ఎలా చేయాలి.. క్షతగాత్రులకు ఎలాంటి చికిత్సలు అందించవచ్చనే అంశంపై డెమో ఇచ్చారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ చేసే విధానం ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు, కమాండర్లు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ప్రయత్నం

ప్రజాశక్తి - చాపాడు

ప్రపంచ స్థాయిలో స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి పేరు మార్మోగబోతోంది. కేవలం 60 సెకన్ల వ్యవధిలో 113 దేశాల పేర్లు ఆ దేశ చిత్రాలను చూసి చెప్పి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేందుకు సోమవారం మాస్టర్ అద్దంకి నిరంతర్ కృష్ణ ప్రయత్నం ప్రారంభించారు. చాపాడు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 5వతరగతి చదువుతున్నాడు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అఫీషియల్ అటెమ్ట్ కార్యక్రమంలో ఈ ఘనతను సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ రోజు పాఠశాల చరిత్రలో ఎంతో విశిష్టమైందన్నారు. పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకుంటున్నప్పుడు కలిగే సందేహాలను ఎలాంటి సంకోచం లేకుండా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ మాధవి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్ర, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు ఈ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు



బాధ్యతలు చేపట్టిన సిఐ నరేష్‌బాబు

ప్రజాశక్తి - ముద్దనూరు

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగా బాధ్యతలు చేపట్టిన సిఐ నరేష్‌బాబు తెలిపారు. స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా నరేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నంద్యాల జిల్లాలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలకు, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించాలన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఇక్కడ సిఐగా పనిచేసిన మోహన్‌రెడ్డి రెండు నెలల క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు.

ఎంఆర్‌పిఎస్ జిల్లా కో-కన్వీనర్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెముళ్లపల్లె గ్రామానికి చెందిన భూమాయపల్లె వెంకటరమణ ఎంఆర్‌పిఎస్ జిల్లా కో-కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం కడప నగరంలోని హరిత హోటల్‌లో జరిగిన ఎంఆర్‌పిఎస్, ఎంఇఎఫ్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ చేతుల మీదుగా వెంకటరమణ నియామక పత్రం అందుకున్నారు.

మోడీకి జనతా ప్రభుత్వానికి పట్టిన గతే..

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జనతా ప్రభుత్వానికి 1980లో పట్టిన గతే 2024లో మోడీ ప్రభుత్వానికి పడుతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ ఇందిరాగాంధీపై కక్ష గట్టి కేసులు మోపి జైలుకు పంపిందన్నారు. ఈ చర్యలను దేశ ప్రజలు హర్షించలేదని చెప్పారు. పర్యవసానంగా జనతా ప్రభుత్వం కూలిపోయిందన్నారు. 1980లో జరిగిన మధ్యతర ఎన్నికల్లో జనతా పార్టీ చిత్తుగా ఓడిపోయిందని ఆయన తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని, ఇందిరమ్మను ఆదరించడంతో ప్రధాని అయినట్లు చెప్పారు. 2024లో కూడా చరిత్ర పునరావృతమవుతుందన్నారు. నెహ్రూ కుటుంబాన్ని, రాహుల్ గాంధీని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు మోడీ ప్రభుత్వం గురి చేస్తున్నట్లు ఆరోపించారు. రాహుల్ గాంధీ అన్న చిన్న కారణాన్ని పట్టుకొని సూరత్ మెజిస్ట్రేట్ కోర్టులో బిజెపి నాయకులు వేసిన కేసును మెజిస్ట్రేట్ రెండేళ్ల జైలు శిక్ష విధించడం దురదృష్టకరమన్నారు. ఆదానీ అవినీతిపై పార్లమెంటులో రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక మోడీ ప్రభుత్వం కుట్రకు పాల్పడిందని ఆరోపించారు. మోడీ లాంటి నియంతలు కాలగర్భంలో కలిసిపోకతప్పదని తులసిరెడ్డి హెచ్చరించారు.

'లిప్'కు ఉపాధ్యాయులు సంసిద్ధం కావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన చేపట్టే లిప్ కార్యక్రమం ఈ నెలాఖరుకు ముగుస్తుందని, వచ్చే ఏడాదిలో జరిగే లిప్ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా సంసిద్ధం కావాలని లిప్ మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరిగే లిప్ కార్యక్రమానికి చెందిన రికార్డులను, కేస్ స్టడీ, ప్రాక్టీస్ పిరియడ్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయుల సహకారంతో లిప్ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిని చదువులో ముందు వరుసలో కూర్చో పెట్టడం లిప్ లక్ష్యమన్నారు. ప్రత్యేక బోధన చేయడంపై ఉపాధ్యాయులు తగు ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్సూరు బాషా, సతీష్, భాస్కర్‌రెడ్డి, రామ చంద్రారెడ్డి, మస్తాన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL Jr.CIVIL JUDGE, KADAPA.
O.S.No. 817/2022

Relangi Munemma.
...Plaintiff

Vs

Goturu Vijaya Bhaskar, S/o Suryanarayana, Aged 41 years, Hindu, D.No.1-4-121, Nagarigutta Street, Pulivendula Town, Kadapa District.
...Defendant No.5

NOTICE

పై దావాలోని వాది బాగపరిష్కార దావా దాఖలు చేసియున్నారు. పై తెల్పిన కోర్టులో జడ్జి గారు 5వ ప్రతివాదులు అయిన మీకు నోటీసు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 6/4/2023 తేది ఉదయం 10.00 గంటలకు పై తెల్పిన కోర్టు నందు మీరు గాని, లేదా మీ తరపున అడ్వకేటు హాజరు అయి ఆక్షేపణలు ఏవైన వున్నయెడల తెలుపుకొవలెను. లేనియెడల మీకు వ్యతిరేకంగా తీర్మాణం చేయబడును.

Y. PRASAD,
Advocate for Plaintiff,
KADAPA, Cell: 7013161449.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT KADAPA.
M.V.O.P. No.247/2022

Guttireddy Ramadevi and 2 Others.
...Petitioners

Vs

Kolasalaguntla Sreenu and 2 Others.
...Respondents

NOTICE R-1

R-1) Kolasalaguntla Sreenu S/o K.Narasimhulu, age not Known, Hindu, Owner of the Car bearing No.AP03CU4581, Resident of D.No.5/20, Rachagudipalli Village, Vontimitta(M), YSR District. Now at H.No.38/22 RK Nagar, Chinnachowk, Kadapa City, YSR District.(R-1).

పై దావాలోని వాది/పిటిషన్ ప్రతివాది అయిన నీపై నష్టపరిహారం కోరుతూ దావా వేసినారు. సదరు కేసులో ప్రతివాది నెం.1 అయిన మీకు నోటీసులు ముట్టనందున మహారాజశ్రీ కోర్టు వారు పేపరు ద్వారా తెలుపమని ఆర్డర్ వేసివున్నారు. సదరు కేసు 03.04.2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వున్నది. కావున నీవు స్వయంగా గాని లేక వకీలు ద్వారా గాని హాజరు కావలెను. అట్లు కాని యెడల దావా నీ పరోక్షం నందు కేసు విచారణ జరుగును.

//By Order of the Court//
CHAVVA SIVA PRASAD REDDY,
Advocate,
KADAPA.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT KADAPA.
S.O.P.No. 4/2023

Anchala Srinivasulu, S/o Late A.Venkata Ramana, Hindu, Retired Employee, aged 68 years, resident of Door No.43/71-2-1-1, Prakash Nagar, Kadap City, Mobile No.9441275683, Mail: Not Available, Adhar No:301033792220.
...Petitioner

Vs

NIL.
...Respondent

GENERAL NOTICE

పిటీషనరు వేసిన పై కేసులో కనపరచిన క్రింది షెడ్యూలు దాఖల ఆస్థి పిటీషనరు అక్క అయినటువంటి ఎ.శశికళ గారిపై వుండి ఆమె ఎలాంటి సంతతి లేక చనిపోయినది. సదరు ఎ.శశికళ గారి వారసునిగా పిటీషనరును డిక్లేరు చేయమని పై కేసు వేసి వాయిదా 27/4/2023వ తేదీన ఎవరికైన ఆక్షేపణలున్న యెడల ఉదయం 10.30 గంటలకు పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట హాజరై తెలుపుకోవలెనని వేసియున్నారు.

SCHEDULE

Kadapa Registration District, Kadapa Registration Sub-District, Presently with in kadapa Municipal Corporation,(Previously Chinnachowk Panchayath), Chinna Chowk Village fields, Plot No.1350 with the following particulars; Survey No.1043/1 in an extent of 160-00 Sq.mts or 191.26 Sq. Yards with the following boundaries:
East : Road, West: Plot No.1367, North: Plot No. 1351, South: Plot No.1349.
With in these boundaries the plot No.1350 with in the following measurements:
North-South=16.00meters; East-West:10.00 meters, with all easement rights.

//By Order of the Court//
C.VIJAYA PRASAD,
Advocate,
KADAPA. Cell: 9866878945.

SRI NARAYANDRI COLLEGE OF EDUCATION, KADAPA.
Phone No. 9494515166.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL

SRI SHANTINIKETAN B.Ed COLLEGE, KADAPA.
Phone No. 7702801559.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL

SRI SAI COLLEGE OF EDUCATION KADAPA.
Buddayapalli, Phone No. 7780362114.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL

PUSHPAGIRI COLLEGE OF EDUCATION
Chinnachowk, Kadapa. Phone No. 9866807180.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL

SRI VENKATESWARA COLLEGE OF EDUCATION
Muddanur, Kadapa. Phone No. 9490099944.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL

SARADA COLLEGE OF EDUCATION KADAPA.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL

PRASAD COLLEGE OF EDUCATION
D.C.Raod, Kadapa. Phone No. 8008444431.
B.Ed. Admissions Notification for 2022-23
Category "B" & "A" (Left over Seats)
Application are invited from eligible candidates for the Academic year 2022-2023, under Management and spot Admissions seats (B&A) left Over seats. Selection will be made as per the APSCHE Guidlines.
Kadapa PRINCIPAL